సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 7 । నవంబర్ । 2024



అంధకారంలో సీలేరు

సీలేరు, చింతపల్లి క్యాంపు, టీఆర్‌సీ క్యాంపు, బూసుకొండ, చంద్రుపల్లి, లైకోన్‌పూర్‌లో 13 గంటల పాటు అంధకారంలో నెలకొంది.

10లో



కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: అరకులో 14.6డిగ్రీలు, చింతపల్లిలో 15.3 డిగ్రీలు, మినుములూరులో 16డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ముగిసిన తిరునక్షత్రం పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తిరునక్షత్రం పూజలు బుధవారంతో ముగిశాయి.

న్యూస్‌రీల్

జగన్‌ను కలిసిన అరకు ఎంపీ



జగన్‌మోహన్‌రెడ్డితో అరకు ఎంపీ తనూజారాణి, ఆమె తండ్రి గుమ్మా శ్యాంసుందర్

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాస గృహంలో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్లమెంట్‌లో ఓబీసీ సంక్షేమ కమిటీ, రోడ్డు రవాణా మంత్రిత్వ కమిటీలో సభ్యురాలిగా ఇటీవల నియమితులవడంతో జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారని ఎంపీ స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు అండగా ఉండాలని జగన్‌మోహన్‌రెడ్డి తనను ఆదేశించినట్టు ఆమె తెలిపారు. ఎంపీతో పాటు ఆమె తండ్రి అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యాంసుందర్, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి అనంత పద్మనాభం కలిశారు.

రంపచోడవరంలో ఎన్నికల కోడ్ అమలు

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఈనెల 4వతేదీ నుంచి రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఎన్నికల కోడ్‌ను అధికారుల పక్కాగా అమలు జేయాలని ఆదేశించారు. మండల స్థాయి, ఎంసీసీ, ప్రత్యేక వీడియో బృందాలను నియమించామని ఆయన పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో రాజకీయ సమావేశాలను వీడియో రికార్డు చేస్తారని, ప్రతిరోజు వాటిని పరిశీలిస్తారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే ఆర్వోలు, ఏఆర్వోలు, సంబంధిత అధికారులకు నివేదించాలని ఆయన ఆదేశించారు.

కాఫీ బోర్డు ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి: ఏజెన్సీలో కాఫీ సాగు చేస్తున్న రైతుల కుటుంబాలకు చెందిన విద్యార్థులనుంచి కాఫీ బోర్డు ద్వారా అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో కాఫీ రైతులకు సంబంధించి గత 15 సంవత్సరాలుగా ఈ ప్రోత్సాహకాలను కాఫీ బోర్డు ద్వారా అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులకు రూ.5వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.10 వేలు, పీజీ విద్యార్థులకు రూ.15 వేలు, వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులకు రూ.20 వేల చొప్పున అందిస్తామన్నారు. వీటిని పొందేందుకు ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 50 శాతం, మిగిలిన విద్యార్థులు 60శాతం మార్కులు పొందాలన్నారు. విద్యార్థులు దరఖాస్తుకు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువపత్రం, కాఫీ తోట పొజిషన్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్ పుస్తకం జెరాక్స్ కాపీలను తప్పని సరిగా జతపరచాలని సూచించారు.ఈ దరఖాస్తులను ఈనెల 30 లోగా పాడేరు(మినుములూరు) చింతపల్లి, అరకులోయ కాఫీ బోర్డు కార్యాలయాల్లో అందజేయాలని ఆయన కోరారు.

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపం

- నిలిచిన విద్యుదుత్పత్తి



సీలేరు జల విద్యుత్ కేంద్రంలో సాంకేతిక లోపంతో తలెత్తిన నాలుగోనంబరు యూనిట్

సీలేరు: స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో సాంకేతికలోపం తలెత్తడంతో 4వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. ఈ కేంద్రం 60 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. వీటిలో సాంకేతిక లోపం తలెత్తడాన్ని గమనించిన అధికారులు వెంటనే ఉత్పత్తి నిలిపివేశారు. అనంతరం యూనిట్లను పరిశీలించారు. నాలుగో యూనిట్ బ్రేకర్ ఆగ్జలరీ స్విచ్‌లో లోపం తలెత్తినట్టు గుర్తించారు. అయితే ఈ స్విచ్ కేంద్రంలో లేకపోవడంతో హైదరాబాద్‌నుంచి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ యూనిట్‌లో కొత్త స్విచ్‌ను అమర్చే వరకు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్టు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గిరిజన ముద్దుబిడ్డకు హ్యాట్సాఫ్

అనంతపురం పోలీసు అకాడమీ శిక్షణలో విశేష ప్రతిభ

చిట్టపులి జీవన.. స్వగ్రామం మారుమూల కిలగాడ. సాధారణ కుటుంబానికి చెందిన ఈమెను పట్టుదల.. సంకల్పం ఉన్నతస్థాయికి చేర్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడేరు ఐటీడీఏ అందించిన సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకున్న జీవన 2023లో గ్రూప్–1కు ఎంపికై అనంతపురం పోలీసు అకాడమిలో శిక్షణ పూర్తి చేసుకుంది. విశేష ప్రతిభ కనబరిచి బెస్ట్ అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్, బెస్ట్ ఫైరింగ్ ట్రోఫీలను సాధించింది. త్వరలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న ఆమె బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు.



పోలీసు అకాడమి శిక్షణలో సాధించిన ట్రోఫీలతో చిట్టపులి జీవన

- మెరిసిన గిరి యువతి జీవన
- ఆల్‌రౌండర్‌గా పతకాలు కైవసం
- తల్లిదండ్రుల ఆశయసాధనే లక్ష్యం
- త్వరలోనే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న చదువులతల్లి



కుటుంబ సభ్యులతో చిట్టపులి జీవన



శిక్షణ సమయంలో సహచరులతో జీవన

ముంచంగిపుట్టు: ఆ యువతి గిరిజన బిడ్డ.. తండ్రి టీచర్, తల్లి ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆమె చదువుకు అవసరమైన సహకారం అందించారు. తన అభ్యున్నతి కోసం వారు పడుతున్న కష్టాలను చిన్నప్పటి నుంచి కళ్లారా చూసిన భావన వారి ఆశయ సాధనే లక్ష్యంగా చదివింది.

- కిలగాడ గ్రామానికి చెందిన చిట్టపులి జీవన తండ్రి రాజుపడాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి రమా పెదబయలు మండల కేంద్రంలో ఫ్యాన్సీ షాప్ నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి జీవన బాగా చదువుతుండటంతో పూర్తి సహకారం అందించి ప్రోత్సహించారు.

రెండు సార్లు ఎంసెట్ తప్పినా..: డాక్టర్ కావాలి అనే లక్ష్యంతో జీవన పట్టుదలతో చదివింది. అదే లక్ష్యంతో రెండు సార్లు ఎంసెట్ రాసినా ఫలితం దక్కలేదు. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడలేదు. డాక్టర్ కావాలన్న ప్రయత్నాన్ని విరమించింది. గ్రూప్స్ వైపు దృష్టి పెట్టింది. ప్రైవేట్‌గా శిక్షణ పొందింది. ఆ తరువాత సివిల్స్ పరీక్షలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో పాడేరు ఐటీడీఏ అందించిన శిక్షణను ఆమె సద్వినియోగం చేసుకుంది. ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించిన గ్రూప్స్ పరీక్ష రాసి సత్తా చాటి డీఎస్పీగా ఎంపికైంది. శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

డీఎస్పీగా మొట్టమొదటి గిరిజన యువతి

జిల్లాలో డీఎస్పీగా కొలువు సాధించిన మొట్టమొదటి గిరిజన యువతిగా భావన గుర్తింపు పొందారు. అనంతపురం పోలీసు అకాడమీ శిక్షణలో కూడా ఆమె ప్రతిభ కనబరిచారు. బెస్ట్ అవుట్‌డోర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ట్రోఫీలు, పతకాలు అందుకున్నారు. వీటితో పాటు బెస్ట్ ఫైరింగ్‌లో సీఎం రివాల్వర్‌ను దక్కించుకున్నారు. శిక్షణ సమయంలో ఆమె కనబరుస్తున్న విశేష ప్రతిభకు ప్రశంసలు వెల్లువెత్తాయి.

చదువుతోనే తలరాతల మార్పు

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తమ ప్రాంతానికి న్యాయపరమైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని జీవన పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే డీఎస్పీ స్థాయికి చేరుకోగాలిగానని చెప్పారు. చదువుతోనే తలరాతలు మారుతాయన్న ఆమె శిక్షణ కాలంలో ప్రతిభకు పొందిన పతకాలను కుటుంబ సభ్యుల సమక్షంలో అందుకోవడం ఎన్నటికీ మరువలేనని పేర్కొన్నారు. లక్ష్యంతో చదివితే తప్పనిసరిగా ఉన్నతశిఖరాలు అధిరోహించగలమని, గిరిజన విద్యార్థులు ప్రతిఒక్కరూ ఈ దిశగా ప్రయత్నించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

మత్స్యగెడ్డలో గిరిజనుడి గల్లంతు

- చేపలను వేటాడుతుండగా ప్రమాదం
- నాటు పడవలతో ముమ్మరంగా గాలింపు



గల్లంతైన సొంబ్రన్న (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో బుధవారం గిరిజనుడు గల్లంతయ్యాడు. చేపలను వేటాడుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొడుగులపుట్టు గ్రామానికి చెందిన పనసగుడియా సొంబ్రన్న(49) గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో నాటుపడవలో నిలబడి చేపలను వేటాడుతున్నాడు. దీనిలో భాగంగా వలను లాగుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోయాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే సొంబ్రన్న మునిగిపోయి గల్లంతయ్యాడు. దీంతో గెడ్డలోంచి నాటుపడవను ఒడ్డుకు తీసుకువచ్చారు. గొడుగులపుట్టు గ్రామ గిరిజనులు మూడు నాటుపడవలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సుజనకోట సర్పంచ్ వెంగడ రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు దేవ, పిత్‌బాష్, ఆర్‌ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సాయంత్రం వరకు గాలింపు చేపట్టినా ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. సొంబ్రన్నకు భార్య, కుమారుడు ఉన్నారు. అతనే వారికి జీవనాధారం. ఇంటి యజమాని గల్లంతుతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.



గల్లంతైన సొంబ్రన్న వాడిన నాటు పడవ ఇదే



మత్స్యగెడ్డలో గాలింపు చేపట్టిన గొడుగులపుట్టు గిరిజనులు

నెలరోజుల్లో మూడు ఘటనలు..

గత నెల రోజుల వ్యవధిలో మత్స్యగెడ్డలో మూడు గల్లంతు ఘటనలు చోటుచేసుకున్నాయి. గత నెల 7వ తేదీన దారెల పంచాయతీ పెద్దపేట వద్ద మత్స్యగెడ్డ దాటుతూ వేణుగోపాల్‌స్వామి అనే గిరిజనుడు గల్లంతై మృతి చెందాడు.

- అదే నెల 26వ తేదీన ఆంధ్ర ఒడిశా సరిహద్దు మాచ్‌ఖండ్ సమీపంలోని మత్స్యగెడ్డలో చేపల వేట చేస్తూ గోల్లోరి శుక్ర అనే గిరిజనుడు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఇప్పుడు సొంబ్రన్న గల్లంతవడంతో మత్స్యగెడ్డ పరివాహక గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

మైనింగ్ జోలికి వస్తే అంతు చూస్తాం

ప్రభావిత ఆదివాసీ గ్రామాల గిరిజనుల హెచ్చరిక



దాబుగుడ మైనింగ్ కొండపై ఆందోళన చేస్తున్న గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు

అరకులోయ రూరల్: మైనింగ్ జోలికి వస్తే అంతు చూస్తామని ప్రభావిత గ్రామాల ఆదివాసీ గిరిజనులు హెచ్చరించారు. బుధవారం వారు దాబుగుడ మైనింగ్ కొండపై గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు రామారావు, రమేష్ వేర్వేరుగా మాట్లాడుతూ ఇక్కడ సుమారు 16 ఎకరాలల్లో నిక్షిప్తమై ఉన్న క్వార్జ్ (మైనింగ్) తవ్వకాలు జరిపితే 12 గ్రామాలు, 800 కుటుంబాలు అన్యాక్రాంతం అవుతాయన్నారు. ఇప్పటికైనా మైనింగ్ తవ్వకాల ఆలోచన విరమించుకోవాలని.. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో తవ్వకాలు చేసేందుకుగాను ప్రజాభిప్రాయాలు సేకరించేందుకు వచ్చిన వారిని ప్రభావిత గ్రామాల ప్రజలు అడ్డుకున్నారన్నారు. తవ్వకాలు జరిపితే తాగునీరు, ఊటగెడ్డలు, సాగునీరు, కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. అటవీ సంపదతోపాటు వన్యప్రాణులు కనుమరుగు అవుతాయన్నారు. పీసా, 1/70,అటవీ హక్కుల చట్టాన్ని పాలకులు తుంగలో తొక్కి గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. మైనింగ్ జోలికి వస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నస్వామి, గిరిజన సంఘం నాయకులు రామన్న, గోపాల్, అప్పన్న పాల్గొన్నారు.

ఎగుమతులకు వీలుగా మన్యం ఉత్పత్తులు

- ఎఫ్‌పీవోలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం
- నాబార్డు డీడీఎం చక్రధర్



లంబసింగి ఎఫ్‌పీవో సభ్యులతో నాబార్డు డీడీఎం చక్రధర్

చింతపల్లి: మన్యంలో గిరిజన రైతులు పండించేవన్నీ ఎగుమతులకు వీలైనవేనని నాబార్డు డీడీఎం చక్రధర్ తెలిపారు. బుధవారం రాజుపాకలు వద్ద లంబసింగి ఆర్గానిక్ పార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ ఎఫ్‌పీవో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పండించే పంట ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా తయారు చేసి ఎగుమతి చేసే రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థికంగా సాయం అందిస్తామని తెలిపారు. జిల్లాలో సుమారు 30 వరకూ ఎఫ్‌పీవోలు ఉన్నాయన్నారు. వీటిలో పదింటికి సుమారు రూ.4కోట్ల వరకూ ఆర్థికసాయం అందించినట్టు చెప్పారు. రైతులు కేవలం పంటలు పండించేందుకు పరిమితమం కాకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఇందుకు వీలుగా సంఘాలకు తమ నాబార్డు అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. లంబసింగి ఎఫ్‌పీవో ద్వారా గత మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు, పంటల ఎగుమతులు వచ్చిన లాభాల వివరాలను సీఈవో రాజేష్ వివరించారు. సుగంధ ద్రవ్య పంటల సాగు చేపట్టే రైతులకు బోర్డు ద్వారా రాయితీని రైతు సంఘాలకు అందిస్తామని పాడేరు స్పైసెస్‌బోర్డు పీల్డ్ అధికారి కల్యాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త బిందు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, ఎఫ్‌పీవో డైరెక్టర్లు ఇందిర, సరోజ, నూకరాజు, మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాలన్నీ ఆదివాసీలతో భర్తీ చేసే వరకు ఉద్యమం

- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి
- ముగిసిన ఆవేదన దీక్ష



దీక్షలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు

పాడేరు : గిరిజన ప్రాంత ఉద్యోగాలన్నీ ఆదివాసీలతో భర్తీ చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఉద్యమాలు కొనసాగుతుందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖీ శేషాద్రి వెల్లడించారు.స్థానిక ఐటీడీఏ ఎదుట అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ చేపట్టిన 48 గంటల ఆదివాసీల ఆవేదన దీక్ష బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ దీక్షలకు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా, గిరిజన సంఘాలు, పార్టీల నేతలు స్వచ్ఛందంగా సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ముఖీ శేషాద్రి ప్రకటించారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన మరుక్షణమే ఆదివాసీలకు అన్యాయం జరిగేలా రాష్ట్ర వ్యాప్తంగా చింతూరు నుంచి సీతంపేట ఏజెన్సీ వరకు నోటిఫికేషన్ పత్రాలు దహనం చేస్తామన్నారు. ఆ మరుసటి రోజు రాష్ట్ర వ్యాప్త ఆదివాసీ ప్రాంత బంద్ చేపడుతామన్నారు. ఈనెల 7న అన్ని మండల తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తామని, 8న అన్ని మండల కేంద్రాల్లో నిరుద్యోగులు, విద్యార్థులతో శాంతియుత నిరసన ర్యాలీలు చేపడుతామన్నారు. రాష్ట్ర వ్యాప్త బంద్ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సింహాచలం, కోశాధికారి వంతాల రామారావు, ఏపీ సీపీఎస్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎం. ఈశ్వర్ రావు, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సొనాయి గంగరాజు పాల్గొన్నారు.

రోగులకు సత్వర సేవలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశం



వాడపల్లి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంఆదేశించారు. మండలంలోని వాడపల్లి పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించి రక్తహీనత నివారించాలన్నారు.అనంతరం నిమ్మలపాలెం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. గ్రామంలో సచివాలయం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని పీవో సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

హుకుంపేట: గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. మండలంలోని ఉప్ప పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. గిరిజన గ్రామల్లో సీజనల్ వ్యాధులతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామల్లో మాతా శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు నాణ్యమైన ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్యాధికారి సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియపై అవగాహన అవసరం

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్
- అధికారులకు ఒక రోజు వర్క్‌షాప్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పీవో అభిషేక్

పాడేరు : ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియపై అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సూచించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో స్వీకరించిన వినతుల పరిష్కారంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు, ఎండార్స్‌మెంట్ వేయడం వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సూచనలిచ్చారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వినతులను మూడు దశల్లో ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. వెబ్‌సైట్‌ను ప్రతిరోజు పరిశీలించి ఫిర్యాదు తమ శాఖకు చెందిందా కాదా అనే విషయాన్ని పరిశీలించి తగిన పరిష్కారం చేయాలన్నారు. అర్జీలపై సక్రమంగా ఎండార్స్‌మెంట్ వేయాలన్నారు. ఫిర్యాదు అందిన తర్వాత నిర్దేశించిన అధికారి అర్జీదారుని ఇంటికి వెళ్లి ఆయనతో ఫొటో తీసుకొని వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ నిర్దిష్టమైన గడువులోగా అర్జీలు పరిష్కరించాలని సూచించారు. సమస్యలు పరిష్కారంలో జాప్యం చేయకుండా తగు విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మలత, ఎస్‌డీసీ భవానీ, ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్‌రావు, డీపీవో కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా నీటి వనరుల సంరక్షణ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



వాటర్ లెవెల్ బోరుబావి వద్ద పూజ చేస్తున్న పీవో

సాక్షి,పాడేరు: నీటి వనరుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పాడేరులో జల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాటర్‌లెవెల్ చూసే ప్రధాన బోరుబావి వద్ద ఆయనతోపాటు ఐటీడీఏ పీవో అభిషేక్ పూజలు చేశారు. అనంతరం పలు శాఖల అధికారులు, విద్యార్థులు పాడేరు పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. జల ఉత్సవం అవశ్యకత, పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జల ఉత్సవాలు ఈనెల 20 వరకు మండల కేంద్రాలు, గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.



పాడేరు పాతబస్టాండ్ వద్ద మానవహారం, ప్రతిజ్ఞ

వేడుకగా యాప్రాన్‌ల పంపిణీ



యాప్రాన్ ధరించిన వైద్య విద్యార్థులతో తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో యాప్రాన్ (తెల్ల కోటు)ల పంపిణీ కార్యక్రమం బుధవారం వేడుకగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి కార్యక్రమానికి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి సంవత్సరం విద్యార్థులందరికీ వీటిని పంపిణీ చేయగా, తల్లిదండ్రుల సమక్షంలోనే వాటిని ధరించారు.అనంతరం రోగులకు సేవలందించేటప్పుడు కొన్ని వైద్య విలువలకు కట్టుబడి ఉంటామని వారు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ లక్ష్మీ కుమారి (అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ పాపారత్నం(అకాడమిక్), హెచ్‌వోడీలు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ లీల, డాక్టర్ రాధ, అసోసియేట్ ప్రొఫెసర్లు,అసిస్టెంట్ ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంధకారంలో సీలేరు

- 13 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా
- ఎట్టకేలకు మరమ్మతులు
- సరఫరా పునరుద్ధరణ

సీలేరు: సీలేరు, పరిసర ప్రాంతాలైన చింతపల్లి క్యాంపు, టీఆర్‌సీ క్యాంపు, బూసుకొండ, చంద్రుపల్లి, లైకోన్‌పూర్ తదితర గ్రామాలు సుమారు 13 గంటల పాటు అంధకారంలో ఉన్నాయి. స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి ఓడీ స్విచ్ యార్డ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకేజీ, సిటీ వైన్డింగ్ కాలిపోయినట్టు అధికారులు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో మరమ్మతులు చేపట్టడానికి వీలుకాలేదు. దీంతో బుధవారం ఉదయం నుంచి జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బంది సాంకేతిక లోపాలను సరిచేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. జెన్‌కో ఏడీఈ శ్రీనివాసులు పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు.

ఎద్దు దాడిలో మహిళకు గాయాలు


ఎద్దు దాడిలో గాయపడిన సన్యాసమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని ఎర్రంపాడు గ్రామానికి చెందిన మడకం సన్యాసమ్మను దుక్కిటెద్దు పొడవడంతో బుధవారం తీవ్రంగా గాయపడింది. పశువుల కొట్టంలోని ఎద్దులను కదుపుతుండగా ఓ ఎద్దు సన్యాసమ్మపై దాడి చేసింది. దీంతో ఆమె కుడి కాలు విరిగింది. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు చికిత్స చేసి, అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. ఆమెకు తీవ్ర రక్త స్రావం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ముగ్గురు గంజాయి నిందితులకు ఏడాది జైలు

చోడవరం రూరల్ : గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ముంచింగిపుట్ మండలం హంసపాదుకు చెందిన వంతల సురేష్(50), జప్పార్ గ్రామానికి చెందిన శేషా సున్ను(56), ఒడిశా రాష్ట్రం చిత్రకొండ మండలం పూల్ పడవ గ్రామానికి చెందిన వంతల సుక్కు(35) 2013 అక్టోబరు 31న అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్ మండలం లంబూరి జంక్షన్‌లో 10 కిలోల గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ముంచింగిపుట్ పోలీసులు కేసు నమోదు చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన జిల్లా జడ్జి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బాబు పాపాలే శాపాలవుతాయి

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు
- సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా రెండు రోజుల్లో 100 మంది అరెస్ట్
- అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలి
- ప్రణాళిక ప్రకారం కాపులను, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి


రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు

విశాఖ సిటీ: 'సుప్రీం కోర్టు తీర్పునకు భిన్నంగా రెండు రోజుల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారు. వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్ చేసే ఈ తప్పులకు పదింతలు అనుభవిస్తారు. బాబు చేసే పాపాలు నాగుపాములా లోకేష్ మెడకు చుట్టుకుంటాయి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకోవాలి' అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి హెచ్చరించారు. బుధవారం విశాఖకు వచ్చిన ఆయనకు జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..

2027లో మళ్లీ అధికారంలోకి వస్తాం..

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న కారణంగా ఎవరినీ అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. అందుకు భిన్నంగా పోలీసులు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. రెండు రోజుల్లోనే 100 మందిపై కేసులు నమోదు చేశారు. దీన్ని వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా బదులిస్తుంది. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది. వైఎస్సార్ సీపీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక ప్రయోజనాలు చేకూర్చాం. కానీ చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి మోసం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సుపరిపాలనను ఐదు నెలల్లోనే నాశనం చేశారు. చంద్రబాబు పరిపాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. 2027లో మళ్లీ నూటికి నూరు శాతం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుంది.

చంద్రబాబు మూర్ఖుడా? అసమర్థుడా..?

రుషికొండపై నిర్మించిన అద్భుతమైన భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదంటున్న చంద్రబాబు మూర్ఖుడో.. అసమర్థుడో.. ఏమనుకోవాలో అర్థం కావడం లేదు. అవి రాష్ట్రానికి తలమానికమైనవి. వాటిని ఎలా ఉపయోగించాలో అర్థం కాకపోతే ప్రొఫెషనల్స్ లేదా కన్సల్టెన్సీకి ఇస్తే వారే మంచి సలహా ఇస్తారు.

ద్వితీయ శ్రేణి పౌరుడిగా పవన్‌కల్యాణ్

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని కూటమి ప్రభుత్వంలో ఒక ద్వితీయ శ్రేణి పౌరుడిగా చూస్తున్నారు. అధికారంలోకి రాక ముందు లోకేష్.. పవన్‌కు పాదాభివందనం చేశాడు. ఇప్పుడు పవన్ ఆదేశాలు పాటించవద్దని అధికారులకు ఆదేశాలిస్తున్నాడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఒక ప్రణాళిక ప్రకారం నెల నెలా కాపు సామాజికవర్గాన్ని, పవన్ కల్యాణ్‌ను అణగదొక్కుతున్నారు. చంద్రబాబును కలిసిన ఒక గంట తరువాత మందకృష్ణ మాదిగ బయటికొచ్చి పవన్‌ను విమర్శించారంటే చంద్రబాబు మార్కు రాజకీయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్తులో పవన్ కల్యాణే తెలుసుకుంటారు. పవన్‌ను కూటమిలో కొనసాగే అవకాశం లేకుండా చేస్తారు. ఆయన ఉంటే లోకేష్ ముఖ్యమంత్రి అవడానికి అడ్డంకులు వస్తాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో 20 శాతానికి పైగా కాపులు ఉన్నారు. అటువంటి పెద్ద సామాజిక వర్గాన్ని ఏరోజైనా ఎదుర్కోవాలంటే కష్టం. అందుకే ఒక ప్రణాళికా బద్ధంగా కాపులను, జనసేనను అణిచి వేసే కార్యక్రమం చేస్తున్నారు.

కచ్చితంగా వన్ నేషన్-వన్ ఎలక్షన్

కేంద్రంలో వివిధ నాయకులతో సత్సంబంధాలు ఉన్న నేతగా చెబుతున్నా.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ జరగబోతోంది. దీంతో పాటు మహిళా రిజర్వేషన్ వచ్చి తీరుతుంది. డీలిమిటేషన్ జరిగి రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య, పార్లమెంట్‌లోని ఎంపీల సంఖ్య పెరుగుతుంది. ఈ మూడు తప్పకుండా జరిగి తీరుతాయన్నది నా అంచనా.

విజయసాయిరెడ్డికి విమానాశ్రయంలో స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), సమన్వయకర్తలు కె.కె.రాజు, మలసాని భరత్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చెంగల వెంకట్రావు, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు వంశీరెడ్డి, పి.వి.సురేష్, ముఖ్యనేతలు బొడ్డేడ ప్రసాద్, జాన్ వెస్లీ, మొల్లి అప్పారావు, ఆల్ఫా కృష్ణ, కొండా రాజీవ్‌గాంధీ, గండి రవికుమార్, వాసుగౌడ్, బి.పద్మావతి, పల్లా చినతల్లి తదితరులు ఉన్నారు.

అర్జీలను సత్వరమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

- సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు
- రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం


సమావేశంలో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం, వేదికపై సబ్ కలెక్టర్ కల్పశ్రీ


హాజరైన అధికారులు

రంపచోడవరం: ప్రతీ సోమవారం ఐటీడీఏ సమావేశపు హాలులో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను 24 గంటల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. ఐటీడీఏ సమావేశపు హాలులో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి సబ్ కలెక్టర్ కల్పశ్రీ కలిసి సమీక్ష నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ప్రతి సమస్య అర్జీకి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అర్జీదారుడి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు ప్రకారం సమస్యలు పరిష్కరించాలన్నారు. అపరిష్కృత సమస్యపై అర్జీదారునికి వివరాలు ఇవ్వాలన్నారు. ఏజెన్సీలో సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో ప్రాజెక్టు మోనటరింగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ అర్జీల అప్‌లోడ్ వివరాలను వివరించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈ నెల 6 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఏపీవో డీఎన్‌వీ రమణ, ఎస్‌డీసీ జాన్‌రాజ్, పీహెచ్‌ఓ చిట్టిబాబు, ఏపీడీ శ్రీనివాసరావు, ఏడీఏ కెవీ చౌదరి, పీఏఓ ఎల్.రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ముగ్గురు ఉద్యోగులకు పదోన్నతులు


ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర సూచనల మేరకు ఈ పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారిలో ఎన్‌వీహెచ్‌ఆర్ స్వామికి రావికమతం మండల పరిపాలనాధికారిగాను, వీఆర్ రాజేశ్వరికి విశాఖపట్నం పరిపాలనాధికారిగాను, వేణుగోపాల్‌కు డుంబ్రిగుడ మండల పరిపాలనాధికారిగాను పదోన్నతి కల్పించారు. తమ ఉద్యోగులకు పదోన్నతి కల్పించడం పట్ల ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన కింది కేడర్ల ఉద్యోగులకు కూడా త్వరితగతిన పదోన్నతులు కల్పించ వలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదనరావు, జెడ్పీ యూనిట్ ప్రెసిడెంట్ పీవీవీఎస్ మూర్తి, పరిపాలనాధికారి రాము పాల్గొన్నారు.

గంజాయి కారు బీభత్సం!

- చెక్‌పోస్టు వద్ద స్టాపర్లను గుద్ది తప్పించుకునే యత్నం
- ట్రాక్టర్ అడ్డుపెట్టి ఛేజ్ చేసిన పోలీసులు
- టైరు పంక్చరై డ్రైనేజీలో కూరుకుపోయిన వాహనం
- కారులో గంజాయి ఉన్నట్లుగా పోలీసుల అనుమానం


అనుమానిత కారును పొక్లెయిన్ సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు

దేవరాపల్లి: ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న కారు బుధవారం రాత్రి దేవరాపల్లిలో బీభత్సం సృష్టించింది. శ్రీరాంపురం వై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద అల్లూరి జిల్లా వైపు నుంచి దేవరాపల్లి వైపు వస్తున్న అనుమానిత కారును ఆపేందుకు సిబ్బంది ప్రయత్నించారు. మెరుపు వేగంతో వచ్చిన కారు ఆపకుండా అక్కడి స్టాపర్లను గుద్దుకుంటూ దూసుకుపోయింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న చెక్‌పోస్టు సిబ్బంది వెంటనే తేరుకొని కారును వెంబడించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల జంక్షన్‌లో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌ను పెట్టించారు. కారు టైరు పంక్చర్ కావడంతోపాటు పోలీసులు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టిన విషయాన్ని గమనించిన సదరు వ్యక్తులు టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న డ్రైనేజీలో కారును దించేశారు. కారును అక్కడే విడిచి పెట్టి అందులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. వెంటనే పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. పొక్లెయిన్ సహాయంతో కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన కారులో గంజాయి ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే సదరు కారులో గంజాయి ఉందా, ఉంటే ఎంత మేర ఉంది, కారులో ఎంతమంది వ్యక్తులు ఉన్నారు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు.. తదితర విషయాలను పోలీస్‌లు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ విషయమై ఎస్‌ఐను వివరణగా కోరగా పోలీస్ చెక్ పోస్టు వద్ద స్టాపర్లను గుద్దుకుంటూ కారు దేవరాపల్లి వైపు దూసుకురావడం వాస్తవమేనని, నాలుగు రోడ్ల కూడలిలో ట్రాక్టర్ అడ్డంగా పెట్టడంతో కారును విడిచిపెట్టి అందులో వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

జల సంరక్షణ అందరి బాధ్యత


డుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


ముంచంగిపుట్టులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష, అధికారులు


కొయ్యూరులో నీటి సంరక్షణకపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ రమేష్, అధికారులు


అరకులోయలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ ఉషారాణి, అధికారులు,ప్రజాప్రతినిధులు


గంగవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/అనంతగిరి(అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/ జి.మాడుగుల/చింతపల్లి/కొయ్యూరు/గూడెంకొత్తవీధి/రంపచోడవరం/గంగవరం: జల్ ఉత్సవ్ కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా బుధవారం విస్తృతంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల్లో పాల్గొన్న పలు శాఖల అధికారులు మాట్లాడుతూ ఈ జల్ ఉత్సవ్ కార్యక్రమం ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. నీటి వనరులు సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్‌లో నీటి సమస్య లేకుండా భూగర్భ జలాలు పరిరక్షించి సాగునీరు, తాగునీరు అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. చెరువులను బాగు చేయడం నుంచి చెక్‌డ్యాంల వరకు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామల్లో నీటి వనరుల సంరక్షణపై ప్రజలకు చైతన్య కల్పించాలన్నారు, ఈ సందర్భంగా నీటి సంరక్షణ, పొదుపు వినియోగంపై సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

పాల్గొన్న అధికారులు

అరకులోయలో ఎంపీడీవో లవరాజు, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్ పాల్గొన్నారు. డుంబ్రిగుడలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, ఎంఈవో శెట్టి సుందరరావు, సర్పంచ్ వెంకటరావు, ఏపీవో సూరిబాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు. అనంతగిరిలో ఎంపీడీవో కుమార్, సర్పంచ్ సోమేల రూతు, ఏపీఎం భద్రం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమ్ పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష , ఏపీవో సంఘునాయుడు పాల్గొన్నారు. జి.మాడుగులలో మండల ప్రత్యేకాధికారి పి.శివయ్య, ఎంపీడీవో తేజీరతన్, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్, ఎంఈవో బాబూరావుపడాల్ పాల్గొన్నారు. చింతపల్లిలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్ , జెడ్పీటీసీ బాలయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, జేఈ కల్యాణ్ పాల్గొన్నారు. కొయ్యూరులో ఎంపీపీ బడుగు రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాలమురళీ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయికృష్ణ, ఏపీఎం సాధన, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాద్రి పాల్గొన్నారు.గూడెంకొత్తవీధిలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మానుయేల్, ఈవోపీఆర్డీ పాపారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్, ఉపాధి పథకం అధికారులు అప్పలరాజు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.రంపచోడవరంలో ఎంపీడీవో సుండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో ఎంపీడీవో పి.జి.రామకృష్ణ, ఏపీవో ప్రకా శ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

జీడి మామిడి తోటలకు స్వచ్ఛంద బీమా పథకం


నర్సీపట్నం డివిజన్ ఉద్యాన శాఖాధికారి శిరీషారాణి

రోలుగుంట: జీడి మామిడి తోటలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్వచ్ఛంద బీమా పథకం అమలు చేస్తున్నట్టు నర్సీపట్నం డివిజన్ ఉద్యానవన శాఖాధికారి శిరీషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు ప్రథమంగా ఎకరాకు రూ.1540 ప్రీమియం చెల్లించాలన్నారు. ఒక ఎకరా బీమా హామీ మొత్తం విలువ రూ.30,800 ఉంటుందన్నారు. పంట రుణం తీసుకోని రైతులు ఈ బీమాను కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), స్థానిక బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. బ్యాంకు ద్వారా పంట రుణం తీసుకున్న రైతులు నేరుగా బ్యాంకు సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 15వ తేదీలోగా బీమా ప్రీమియంను చెల్లించాలని ఆమె కోరారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


సరస్వతి (ఫైల్)

రాజవొమ్మంగి: దీపావళి రోజున మండలంలోని వాతంగి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సరస్వతి (55) కాకినాడలో చికిత్స పొందుతు మంగళవారం రాత్రి మృతి చెందారు. దీపావళి రోజున ఇంటి ముంగిట దీపాలు వెలిగిస్తుండగా చీరకు దీపం అంటుకొని ఆమె గాయపడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కాకినాడలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ అగ్ని ప్రమాదంలో సరస్వతికి చెందిన కిరాణాషాపుతో పాటు సామగ్రి పూర్తిగా దగ్ధమైన సంగతి తెలిసిందే. సరస్వతి మరణంతో భర్త ఈశ్వరరావు, కుమార్తె అనిత దుఃఖానికి అంతులేకుండా పోయింది. కాగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ భీంరెడ్డి శుభలక్ష్మి అధికారులను కోరారు.

కుమారుడిపై గొడ్డలితో దాడి


గాయాలతో రాజేష్


అనకాపల్లి: మాటా మాటా పెరిగి కుమారుడిపై తండ్రి గొడ్డలితో దాడి చేసిన ఘటన గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేట గ్రామంలో జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. ములుగు సూరి అప్పారావు, అతని కుమారుడు రాజేష్ తాపీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంటారు. రాజేష్ పనులకు వెళ్లడం లేదని, వివాహం జరిగిన తరువాత అతని కుటుంబాన్ని పోషించాలంటే కష్టంగా ఉందని సూరిఅప్పారావు కుమారుడిని మందలించాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తండ్రి సూరిఅప్పారావు కొడుకు రాజేష్ ముఖంపై గొడ్డలితో దాడి చేశాడు. రాజేష్‌ను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్చామని ఎస్ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కాలినడకన తిరుమలకు పయనం


కాలినడకన వెళ్తున్న యువకుడు గురుమూర్తి

సీలేరు: తిరుమల తిరుపతి వెంకన్న స్వామి వారి దర్శనం కోసం ఓ యువకుడు స్వామి వారి మాల ధరించి తిరుమలకు బయలుదేరాడు. సీలేరు గ్రామానికి చెందిన జెన్‌కో రిటైర్డ్ ఉద్యోగి కొర్రా ధను తనయుడు కొర్రా గురుమూర్తి ఏటా వెంకన్న మాల ధరించి కాలినడకన సీలేరు నుంచి భద్రాచలం మీదుగా విజయవాడ చేరుకొని అక్కడ నుంచి తిరుమలకు వెళ్తాంటాడు. ఈ ఏడాది కూడా మాలధరించి, బుధవారం గ్రామంలోని ఆలయాలను దర్శించుకొని కాలినడకన తిరుమలకు పయనమయ్యాడు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాలినడకన తిరుమల వెళ్లడం మూడోసారి అని, మార్గమధ్యలో ఉన్న ప్రతీ ఆలయాన్ని దర్శించుకొని తిరుమలకు చేరే సరికి నెల రోజుల సమయం పడుతుందన్నారు. లోకకళ్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టామనానరు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామపెద్దలు శ్రీనివాసు, కృష్ణ, తదితరులు ఆయన వెంట సుమారు 5 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రేగం ఉదయ్ కిరణ్


అస్వస్థతకు గురైన సాయి కుమార్

మరొకరికి అస్వస్థత

పాడేరు : మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగిలోని ఓ రిసార్ట్స్‌లో విద్యుత్ షాక్‌తో ఓ గిరిజన యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మండలంలోని డేగలవీధి గ్రామానికి చెందిన రేగం ఉదయ్‌కిరణ్‌తో పాటు వంజంగి గ్రామానికి చెందిన సాయికుమార్ బుధవారం ఇనుప నిచ్చెనను రిసార్ట్స్‌లోని ఓ విద్యుత్ స్తంభం వద్ద నిలబెట్టి ఉంచేందుకు ప్రయత్నిస్తుండగా వారికి విద్యుత్ షాక్ తగిలింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికే ఉదయ్‌కిరణ్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం సాయికుమార్ కోలుకున్నాడు.

తల్లిదండ్రులు మందలించారని బాలుడి ఆత్మహత్య

విశాఖ విద్య: బడికి తరచూ దుమ్మా కొడుతున్నాడని మందలించినందుకు ఓ బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుమారులే సర్వస్వం అని ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఆ తల్లిదండ్రులకు ఊహించని రీతిలో జరిగిన ఈ ఘటన తేరుకోలేకుండా చేసింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గోపాలపట్నం మండల పరిధిలోని కొత్తపాలెంలో నివాసం ఉంటున్న దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు. కుమారులిద్దరినీ బాగా చదివించుకోవాలనే తపనతో ప్రైవేట్ స్కూళ్లలో వేశారు. చిన్న కుమారుడు(12) కొత్తపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు తరచూ దుమ్మా కొడుతుండటంతో పాటు చదువుల్లోనూ బాగా వెనుకబడుతున్నాడు. దీనిపై కుమారుడిని పలుమార్లు తల్లిదండ్రులిద్దరూ మందలించి బాగా చదువుకోవాలని సూచించారు. అయినప్పటికీ అదే పంథాను అవలంబిస్తూ.. బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్న విషయాన్ని గుర్తించారు. బుధవారం మరోమారు మందలించారు. తర్వాత భార్యను ఆమె విధులు కాలేజీ వద్ద దింపి.. తిరిగి ఇంటికి వచ్చిన భర్తకు ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ఆయన వెంటనే బాలుడిని కిందకు దింపి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఇలా అఘాయిత్యానికి పాల్పడి, తమకు దూరమైపోవడాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గోపాలపట్నం సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేక్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్), రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశిల్ యోజన 4.0 పథకంలో భాగంగా ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కోసం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హతతో ఎలక్ట్రీషియన్ శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు, ఇంటర్ అర్హతతో సర్వేయర్ శిక్షణకు 15 నుంచి 45 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులకు మూడు నెలల పాటు మాకవరపాలెం నేక్ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిగా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబర్లు 77803 74625, 77802 75922లలో సంప్రదించాలన్నారు.